


తీర్చిదిద్దుకొన్న తీరును బట్టే ఈ ఇల్లు తెలుగు వాడిదని చెప్పే రోజులు పోయాయి. మారుతున్న కాలాన్ననుసరించి మారిపోతున్న అభిరుచులు మనసులను మరింత యాంత్రికతవైపుకే మరల్చుతున్నట్లున్నాయి. సంప్రదాయ నిరసనము ఆచారాల తిరస్కారణము వర్తమానానికి అలవాటుగానో, అవసరంగానో అయిపోతున్నాయి. ఎంతయినా, ఏమయినా కనీసం పండుగల పేరు చెప్పయినా అనూచానంగా వస్తున్న మన అభిరుచుల తీరుతెన్నులను స్మృతికి తెచ్చుకొని కనీసం పండుగనాడయినా నిండుగా మెండుగా మన తెలుగుతనాన్ని తీర్చిదిద్దుకుంటే ఎంత బాగుంటుంది.

సంక్రాంతి అంటే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి శోభ అంతా సస్యరమణిశోభ. అది జీవితాలకే నవోదయం. ఏరువాకల గానాలు ఎద ఎదలో మధురంగా ధ్వనించే శుభోదయం, భోగి సంక్రాంతి. కనుమ మూడురోజులూ వరుసగా పండుగే, గొబ్బిళ్ళు, రేగుపళ్ళు, ముద్దబంతిపూలు కోళ్ళపందేలూ, గంగిరెద్దులూ, జంగమదేవరలు, హరిదాసులు, గాలిపటాలూ పిండివంటలూ. కొత్త బట్టలూ అబ్బో ఎన్నెన్ని.

సంక్రాంతి అనగానే ఒక్కొక్కరికి ఒక్కొక్కటి గుర్తుకొస్తాయి. పసివాళ్ళకు భోగిపళ్ళు, పెద్దపిల్లలకు గాలిపటాలూ, పెద్దలకు పుణ్యకథలూ పంట పొలాలూ. బహుశా రాజకీయ నాయకులకూ కోళ్ళ పందేలూ లాంటివి. అమ్మాయిలకూ, తెలుగు ఇల్లాళ్ళకూ అయితే ముగ్గులూ, గొబ్బిళ్ళూ లక్ష్మి పూజలూ గుర్తుకొస్తాయి.

నిజానికి సంక్రాంతి శోభ అంతా ముగ్గుల్లోనే వుంటుందేమో; అందుకే దీన్ని ముగ్గుల పండుగ అనటంకూడా కద్దు. ముంగిళ్ళన్ని ఈ సంక్రాంతి రోజుల్లో రంగవల్లికలతో హంగులీనుతూ వుంటాయి. అసలు ఈ ముగ్గులు వేయడం ఎందుకు, గడపలకు పసుపులురాసి కుంకుమ బొట్లెట్టటం ఎందుకు? అని ఆధునిక యువతి ఇవాళ ప్రశ్నించినా నేను ఆశ్చర్యపోను. ఆలోచించాలే గానీ ఆచారాల వెనుక ఏదో ఒక లక్ష్యం ఉద్దేశ్యం వుండినే వుంటాయి.

పూర్వం రాజుల కాలంలో సౌధాలన్నింటినీ, ప్రాంగణాలన్నింటినీ కస్తూరితో అలికేవారుట. అప్పుడే వేసిన గోమయం కస్తూరితో సమానం అని ఆయుర్వేదశాస్త్రం చెబుతోంది. అందుకనేముందుగా ఇంటిముంగిట జల్లే కళ్ళాపి నీళ్ళలో పేడకలుపుతూ వుండేది. పేడనీళ్ళు జల్లిన ముంగిలి పచ్చపచ్చని కాంతితో వింత శోభతో వుంటుంది. ఈ పేడనీళ్ళు జల్లడం వలన శోభకు తోడుగా మరొక ప్రయోజనం వుంది - ఆ చెంతకు విషరోగ క్రిములు, సూక్ష్మజీవులు రావు. పైగా ఆ వాతావరణం బొగ్గుపులుసువాయువును ప్రాణవాయువుగా మార్చుతుంది. ఆ ముంగిలి మీదుగా వీచే గాలిసైతం పరిశుభ్రమౌతుందన్నమాట. పచ్చపచ్చని ఆముంగిట్లో తెల్లని ముగ్గు వేయడం వలన ఆనందమే కాక ముగ్గు కూడా సూక్ష్మజీవులను దరిజేరనీయదు. నీలాల ఆకాశంలో కాంతులీను నక్షత్రాలను పరమాత్మ స్వరూపంగా భావించి దానిని యింటి ముందు ప్రతిష్ఠించడం ముగ్గు అనవచ్చు. ప్రకృతి సిద్ధమయిన ప్రత్యేక అలంకరణ అనిపించేది ముగ్గు. ముగ్గుకు వున్న ప్రాముఖ్యం అలాంటిది. ఈ ప్రాముఖ్యాన్ని తెలియచెప్పే జానపద గీతం కూడా కనిపిస్తోంది.

ఇల్లు చూడు
ఇల్లందము చూడు
ఇంటిలోని ఇల్లాలిని చూడు
ముగ్గుచూడు
ముగ్గందము చూడూ
ముగ్గులో ఉన్న మురిపెము చూడూ

ఇంతేకాదు. రామాయణ కాలంలో జనకుడు కూడా సీతాదేవిచేత ముగ్గు వేయించినట్లు దాఖలా గీతి కనబడుతోంది. రాజకుమారి అనయినా తలచక సీత చేత రంగవల్లిక వేయించాడు.

సంతానపరుడమ్మ జనకమహాముని-తా ముద్దు
కూతురుని తాజేరబిలిచి - ఆవుపేడదెచ్చి అయినిళ్ళు
అలికి - గోవుపేడతెచ్చి గోపురాలు అలికి - ముత్యాలు
చెడగొట్టి ముగ్గులేయించి - పగడాలు
చెడగొట్టి పట్టిలేయించి...

పై పాటవలన ముగ్గు ప్రాముఖ్యం అనాదిగా వుందనే సంగతి అర్థమవుతుంది.

ఇప్పుడిప్పుడయితే గడపలకు వార్నిషులు పూస్తున్నారు మనవాళ్ళు. కానయితే పసుపు రాసి కుంకుమ పెట్టడంలోని ఉద్దేశం. భావం వార్నిషులు పూయడం వలన నెరవేరుతాయా? పసుపు కూడా సూక్ష్మ జీవులను నాశనం చేస్తుంది. వంటికి రాసుకోవడం వలన శరీరానికి వర్చస్సునిస్తుంది. గడపలకు రాయడంలో గల ఉద్దేశ్యం పసుపు లక్ష్మికి సంకేతం, కుంకుమ గౌరికి సంకేతం. లక్ష్మి, గౌరి ఇద్దరుకూడా సిరిసంపదల దేవతలు. పసుపు కుంకుమల ద్వారా వారిని ఆహ్వానించడం వలన సిరిసంపదలుకలిగిసౌభాగ్యం

లభిస్తుందని పసుపు, కుంకుమలు చిరకాలం నిలుస్తాయని భావన. పసుపు కొమ్ము మంచి ఓషధికూడాను. దీని మీదనుండి ప్రసరించే గాలి కూడా శుభ్రపడుతుంది. ఆయుర్వేద రీత్యా అంటు వ్యాధులు దరిజేరనేరవు. గడపలకు పసుపు రాసి, కుంకుమ బొట్టు పెట్టి ద్వారానికి మామిడి తోరణం కడితే ఎంత శోభాయమానంగ వుంటుంది? మామిడాకుల అందం మరి దేనికీ రాదు.

ముగ్గుల్లో కూడా ఎన్నో రకాలు వున్నాయి. శివుడు కళ్ళం, పద్మం, గుంటలకోనేరు. పాముల బుట్ట, జోకర్ల ముగ్గు, ఏనుగుల ముగ్గు, పన్నీరు బుడ్డి, గంధపుగిన్నె, మల్లిపందిరి తాబేలు. కొబ్బరి బొండాలు, మారేడు దళము సజ్జ, అడ్డబాస, నిమ్మ గుత్తివంటివి పుష్యమాసంలో తెలుగు ఇంటి ముంగిళ్ళ కనబడే, ముగ్గుల్లో కొన్నింటి పేర్లు. ఇంకా సంక్రాంతి రోజుల్లో పిస్తారు. బాణము, గుమ్మడికాయ, సంక్రాంతి ముగ్గు, వైకుంఠ ద్వారాలు, పాము, రథం అనేవి ముఖ్యంగా ఎన్నో కవిపిస్తాయి. పండుగ చివరి రోజుల్లోరథం తాడు పొడుగ్గా వేస్తారు. (ఈ రథంముగ్గుగురించే కార్టూనిస్టులు ఎగతాళిపట్టిస్తుంటారు. ఒకావిడరథం తాడును మరొక రింటి రథం తాడు దాకా పొడుగ్గా వేసుకుంటూ వెళ్ళి ఇల్లు తప్పిపోయిందిట.) (ఈ ముగ్గులన్నీ ఏలా వుంటాయో చూపించాలంటె ఆ బొమ్మలు చాలా పేజీలను మింగే స్థాయి కాబట్టి కొన్నిటిని మాత్రం చూపాను).

ఈ ముగ్గుల పండుగ మనకేకాదు. ఒరిస్సా ప్రాంతంలో వీని ప్రాముఖ్యత బాగా కనిపిస్తుంది. పుష్య మాసంలో ఆంధ్రలో అయితే, మార్గశిర మాసంలో ఒరిస్సాలో ముగ్గుకు ప్రాధాన్యం, ముగ్గుల చిత్రాన్ని ఒరిస్సాలో "ఝుటి" అంటారు. ఒరిస్సావారి ముగ్గుల్లో అష్టదళ పద్మానికి ప్రాముఖ్యం ఎక్కువ. పద్మాన్నే వారు పలురీతుల వేస్తుంటారు. ముగ్గు వేసేముందు వేయదలచిన ప్రాంతాన్నంతా వారు గోమయంతో అలికి నియమిత ప్రదేశాల్లోనే ముగ్గులుంచుతారు. మరీ ముఖ్యంగా వారు ముగ్గు నుంచు ప్రదేశంలో ప్రత్యేకించి వృత్తాకారముగా జేగురు పూతపూసి అది ఆరిన తరువాత దానిపై ముగ్గు అలంకరిస్తారు.

మెట్ల మీద కూడా వారు ముగ్గువేస్తారు. కానయితే మెట్లమీదంతా ముగ్గుఉంచక మెట్లకు ఒక కొసనుగాని, రెండు కొసలగాని మధ్యగాని జేగురుతో గుండ్రంగా అలికి అందులో చిన్న చిన్న చిత్రాలనలంకరిస్తారు. ఆఖరి మెట్టుపై పూర్తిగా అలంకరిస్తారు.

అయితే వీరు ముగ్గుకు సాధారణంగా వరిపిండి గుల్ల ముగ్గు వాడక బియ్యం నానబెట్టి, బాగా రుబ్బి అందులో చిన్న దూదిపింజెను ముంచి వేళ్ళతో నొక్కుతూ ఉంగరపు వేలితో ముగ్గును రూపొందిస్తారు. మార్గశిర మాసంలో ప్రతి గురువారం లక్ష్మీపూజ చేయడం వీరి ఆచారం, ప్రతి గురువారం ధాన్యం చిన్న చిన్న గంపల కెత్తి ఆ గంపలను పూజిస్తారు. వాటిని పెట్టే స్థలాల్లోనూ, వాటి వెనుక గోడలపైన చతురస్రంగాగాని, దీర్ఘచతురస్రంగా గాని జేగురు నలుదుతారు. రేపు పూజ అనగా బుధవారంనాడు ఈ ముగ్గుల అలంకరణ నిర్వహిస్తారు. ఉదయం గోమయంతో అలకడం మొదలు పెడితే సాయంకాలానికి ముగ్గుల అలంకరణ పూర్తవుతుంది.

వీరి ముగ్గుల్లో పద్మానికే ప్రాముఖ్యం అయినా ఇంకా శంఖం, చక్రం, కుంభం, స్వస్తిక్, పెరుగుకడవ, లక్ష్మిపాదములు, తులసికోట మొదలైనవాటిని అలంకరిస్తారు. ధనలక్ష్మిని పూజిస్తారు కనుక వరివెన్నులు, గాదెచిత్రాలు కూడా వుంటాయి.

అన్ని కులాలవారూ గురువారం పూజలు చేస్తారు. పూజ అయిన ఆ మాసపు తొలి గురువారం తరువాతనే కోతలు ప్రారంభిస్తారు. పంట కోత కొచ్చినా కూడా అంతకు ముందే, పూజ అయితేగానీ వారు కోతపనికి పూనుకోరు.

పూజనాటి సందడి ఒక ఎత్తయితే అంతకు ముందునాటి ముగ్గుల పండడి ఒక ఎత్తు. ఏమయినా ముగ్గుల అలంకరణలోని ఆనందం, స్త్రీకి అది నేర్పే నేర్పు, కూర్పు, ఓర్పుకు సాటి పండుగ రోజుల్లో మరొకటి లేదా అనిపిస్తుంది.

తెల్లవారుఝామునే లేచి కోడికూతల నేపథ్యం కమ్మని సంగీతంగా, చిరుచలిగాలుల చల్లదనంలో దూరంగా అక్కడక్కడి భోగిమంటలు వెచ్చదనం అనుభవిస్తున్న పిల్లకాయల కేరింతలే ప్రశంసలుగా కల్లాపి జల్లి వచ్చని ముంగిలిపై తెల్లని ముత్యాల్లాంటి ముగ్గుల నలంకరిస్తున్న తెలుగు పడుచు అప్పుడు స్వయానా ప్రకృతి కాంతలానే గోచరమౌతుంది. ముగ్గుల నిగ్గులతో, ముగ్గుల నిగ్గులలో తేజరిల్లుతుంది. ★

# శ్రీనివాస కళ్యాణం

(7 వ పేజీ తరువాయి)

(7 వ పేజీ తరువాయి)

మన పెళ్ళి శుభంగా ముగిసింది."

"అది కాదండీ... నాకు..." ఏమోచెప్ప బోయింది అమ్మాయిగారు.

"ఓహో కమలీ...పిచ్చి కమలీ... ఏమీ భయపడకు. నీకు మనసిచ్చిన వాడు నేను. నా భార్యవునీవు... సరేనా" గట్టిగా నవ్వాడు సీను. కమలికూడా నవ్వింది అతి సన్నగా.

## 5

"ఏయ్ కమలీ... ఇదో చూడు... నీవురాసిన జాబులు. ప్రేమలేఖలు !... నీవు రాసిందేకదా. చెప్పు

కమల చూచి చదువుకొని అదిరిపడింది.

"ఇదేమి చిత్రంగా వుందే. ఇలాటి పిచ్చిపని నే నెప్పుడూ చేయలేదు. నా పేరు సుగాత్రి కాదు. కొంచెం ఆగండి ... ఇవి నాన్న వ్రాసిన లేఖల్లా వుంది. ఔను ... ఇవి నా తండ్రిగారు వ్రాసిందే ... సందేహం లేదు."

శ్రీనివాసులు ఆశ్చర్యంతోఆమెవైపుచూచాడు.

"నీ నాన్నగారు ... ప్రస్తుతం సాక్షాత్ పిల్లనిచ్చిన మామగారు-యాభై ఏండ్లు దాటిన వృద్ధులు ...ఇలాటి ప్రేమలేఖలు వ్రాసారంటే ఆయనకు పిచ్చా ?"

"ఔనయ్యా ఔను ... పిచ్చి నాకే. కమలకి ఈ లేఖల సమాచారం ఏమీతెలీదు. అవి వ్రాసింది నేనే." వెనుక నుండి వినిపించింది రంగనాథరావు గంభీర కంఠం.

"మీరు వ్రాసారా ఇవి ! దీని అర్థమేమిటి? ఇదేమి జగన్నాటకం !"

"ఏముంది. నీకు చెప్పినట్లు కట్నాలిచ్చి పెళ్ళిచేయడం బీదవాడైన నాకు సాధ్యం కాకపోయింది. నీ మంచితనాన్ని గ్రహించి నీకెలాగైనా కమలనిచ్చి పెళ్ళి చేయాలని సంకల్పించుకొన్నాను. ఈ కాలం కుర్రాళ్ళకు "ప్రేమలేఖలు" మరి "మనోరంజకమైన అమ్మాయిల పేర్లు" ఇలాంటి విషయాల్లో పనిచేస్తుందని ఇప్పటి సినిమాలు చాటుతున్నాయి. ఒక "ఎక్స్‌పెరిమెంటు" చేసి చూద్దామని "సుగాత్రి" పేరుతో ఒక చిన్న ప్రయోగాన్ని చేసాను. ఫలించింది. ఇటు చూడయ్యా... నీకు నేను చేసిన మోసం ఏమీలేదు... కమలని నీవు మెచ్చావు ఒప్పుకొన్నావు. నీకు కావల్సింది అమ్మాయి అందం... మంచితనం. ఈ రెంటికి కమల ఎంతమాత్రం తీసిపోదు ఒకవేళ నేను చేసింది మోసమని నీవు తలిస్తే నాపైగాని అమ్మాయిపైనగాని పగ పూనవద్దు... నన్ను క్షమించు... కమలని కరుణించు" వణుకుతున్న ధ్వనితో చెప్పారు రావు గారు.

"అయ్యో...అలాటి మాటలు ఆడకండి. మీరు పెద్దవారు. నన్నడిగితే మీరు నడిపించిన విధం ఆడపిల్లల కన్న పేదవాండ్లకు దారి చూపించే ఒక అస్త్రం. మీపైన పగ ఏమాత్రం నాకు లేదు" వంగి నమస్కరించాడు సీను. "పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు" ఆశీర్వదించారు రంగనాథరావు. "నాన్న ఎంత మేధావి" ఆశ్చర్యపోయింది "కమలి"... కాదు రావుజీ కల్పనా లోకపు సుగాత్రి. ★


దీర్ఘరోగులకు

ఉత్తమ వైద్యము



హస్త ప్రయోగం అవయవము చిన్నదగుట. అవసరకాలమందు అసంతృప్తి శుక్లనష్టము, నపుంసకత్వము, ఉబ్బసము, కుష్టు, బొల్లి, చర్మ వ్యాధులు. కడుపునొప్పి. చెవుడు... పోస్టుద్వారా చికిత్స చేయబడును.

డా॥ పి. కుమారస్వామి దేవర.

టి. బి. రోడ్ తెనాలి ఫోన్‌నెం. 551.

బ్రాంచి : 9-డి. శివాజి స్ట్రీట్ మద్రాసు-17.

Source: A.P. Press Academy Website, Pragathi Patrika - 1973

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan